# భయం

వాచీ చూసుకున్నాను. టైము ఆరున్నర అమ్మాయి ఇంకా కాలేజికి వెళ్ళటానికి రెడీ కాలేదు.

పావుగంట నుంచి స్కూటర్ స్టార్ట్ చేసి నుంచున్న నాకు విసుగువచ్చింది. ఇంజన్ ఆపేసి ఇంటి మెట్లు ఎక్కాను.

"నీకు చెప్పటం నా వల్ల కాదే తల్లీ" మా ఆవిడ విసుక్కొంటోంది. "ఇరవై ఏళ్ళు నెత్తికొస్తున్నాయి. చక్కగా చీర గానీ, లంగా ఓణీగాని వేసుకోక ఏమిటా వేషం?"

"నీకు తెలీదు మమ్మీ", మా అమ్మాయి వసంత అంది " ఈ డ్రస్సే మంచిది".

"ఔను లేమ్మా, నాకేం తెలుసు? వంట ఇంట్లో పడి చచ్చేదాన్ని . అందుకే గా నా మాట వినక ఇలా ఏడ్పిస్తున్నావు" మా ఆవిడ అంది. ఐనా ఆడపిల్లలు మొగపిల్లల్లా ఫేంట్లు, షర్టూ వేసుకోటం, జుత్తు క్రాపు చేసుకోవటం నేనెరగనులే తల్లీ".

"నేను జుత్తు క్రాపు చేసుకున్నానని ఏడుస్తావెందుకు మమ్మీ? నీకు మంచి సవరం వచ్చింది కాదా?" వసంత మొండిగా అడిగింది.

మా అమ్మాయికి మోకాళ్ళదాకా జుట్టు ఉండేది. ఓ ఆరు నెలలు క్రితమే జుత్తు కత్తిరించుకొని, క్రాపు చేసుకోవాలనే కోరిక పుట్టింది, వసంతకి. మేము మొదట్లో ఒప్పుకోలేదు. కానీ వారం రోజులు నిరాహారదీక్ష చేయటంతో అమ్మాయి కోరికని ఆమోదించక తప్పలేదు. మొదటిసారి కత్తిరించిన జుత్తుతో మా ఆవిడ సవరం కూడా కట్టించుకొంది.

ఇంకా ఏవేవో వాదించుకొంటున్నారు తల్లీ కూతుళ్ళు. మా అమ్మాయి ఎందుకిలా మారిపోయిందా అని ఆలోచిస్తూ నిలబడ్డాను. "నాకీ గౌను వద్దమ్మా" వసంత అంది. "నాకు పరికిణీయే కావాలి" అప్పుడు మా అమ్మాయికి పదేళ్ళు.

"అన్నీ పరికిణీలే కావాలంటే ఎలాగ అప్పుడప్పుడు గౌనులు కూడా వేసుకోవాలి" మా ఆవిడ అంది, "ఐనా గౌన్లు తొడుక్కునే వయస్సిది".

వసంత ఒప్పుకోలేదు. ఏడ్చి గొడవపెట్టి పరికినీ కొనిపించుకొంది. కానీ ఇప్పుడు......

షూ చప్పుడు వినిపించింది తల ఎత్తి చూసాను. ఫేంటూ షర్టూ వేసుకొని వస్తున్న వసంతని చూస్తే అమ్మాయో, అబ్బాయో పోల్చటం కష్టం.

" పద డాడీ" గబగబా నడుస్తూ అంది వసంత "టైమయిపోయింది".

"ఎందుకమ్మా అలా రోజూ మమ్మీతో పోట్లాడతావు?" స్కూటర్ స్టార్ట్ చేస్తూ అన్నాను. "మమ్మీ చెప్పినట్లు చీర కట్టుకోవచ్చుగా?"

"చీర కట్టుకోవటం, జుట్టు పెంచుకొని పూలజడ వేసుకోవటం నాకు ఇష్టం లేక కాదు డాడీ, కానీ...."

"కానీ...."

"ఎదిదగిన ఆడపిల్లగా రోడ్డు మీదకు వెళ్ళాలంటే భయం వేస్తుంది డాడీ. నిజం చెప్పాలంటే ఎదిగిపోయానని తలుచుకుంటేనే భయం వేస్తోంది".

నేను ఏమీ అనలేకపోయాను.

మా ఆవిడ పల్లెటూరులో పుట్టింది, అస్సలు చదువుకోలేదు. అయినా, ఆతరానికి అనిపించని భద్రతా రాహిత్యం. విద్యావతి ఐ, అన్ని రంగాలలోనూ పురుషులతో సమానంగా అడుగులు వేస్తున్న నేటి యువతికి అనిపిస్తుందంటే స్త్రీ సంక్షేమ సంఘాలు సాధించినదేమిటి?

ఆంధ్రభూమి దినపత్రిక **1991** జూన్